కథ

# ఉత్తరం

– శ్రీమతి పరిమళ శ్రీధర్

**నిరీక్షించడం కంటే నరకం ఈ భూ ప్రపంచంలో మరోటి వుండదు. అందునా ఉత్తరాల కోసం ఎదురు చూడ్డం వుంది చూశారూ! అది మరీ దుర్భరం. తెలిసీ ఎదురు చూడ్డం అజ్ఞానం అని తెలిసినా మనసులో మిణుకు మిణుకు మనే ఆశ గుమ్మం వైపు నడిపించింది. పోస్ట్‌మేన్ మా ఇంటి వైపు సైతం తిరిగి చూడకుండా వెళ్ళి పోవడం చివుక్కు మనిపించింది. "పోస్ట్‌మేన్ వెళ్ళిపోయాడుగా ఇక రా! వడ్డించు" అంటున్న మావారి మాటలతో లోపలికొచ్చాను.**



"రోజూ ఇదే వరస. అయినా మనకి ఉత్తరాలు రాసేవాళ్ళవరోయ్? చీటికి మాటికి ఫోన్లు చేసి టూకీగా విషయం చెప్పేస్తారు. వస్తే పెళ్ళి పత్రికలు, ఆఫీసు కాగితాలు రావాల్సిందే" అంటూ పళ్ళెం ముందు కూర్చున్నారాయన.

నేను వంటకాలతో పాటు జ్ఞాపకాలు కూడా వడ్డిస్తున్నానని ఆయనకీ తెలుసు. ఉత్తరాలు. అబ్బో ఎన్ని ఉత్తరాలో! మా ఇంటిల్లపాదీ రాసుకున్న ఉత్తరాల్ని కట్టలుగా కట్టి, నేనే స్వయంగా కుట్టిన వెల్వెట్ బ్యాగులో భద్రంగా దాచుకున్నాను. "ఈ ఉత్తరాలు ఇలా ఎంతకాలం దాస్తావోయ్!" అంటారాయన తమాషాగా. ఇవి నా జ్ఞాపకాల్లాగే నాతో పాటు బూడిదవ్వాల్సిందే" అంటే "అబ్బో. ఆశే. అలా అయితే మరి నా సంగతో. "సరి. ఇద్దరికీ చెరి సగం" అంటారాయన. అంతగా మా జీవితాలతో పెనవేసుకుని పోయాయి ఆ ఉత్తరాలు. జీవితంలో మేం ఎదుర్కొన్న ప్రతి సంఘటనలు, సంతోషాలు, సవాళ్ళు, అనుభవాలకి ఆ ఉత్తరాలు అక్షర సాక్షులు. అవి ఒక్కోసారి గాయపడిన మనసుకి మందు లాంటివి కూడా.

పిల్లలకి మాలాగే ఉత్తరాలు రాసే అలవాటు అబ్బింది. వాళ్ళు కాలేజీ రోజుల్లో మాకెన్నో ఉత్తరాలు రాసేవాళ్ళు. దూరంలో వున్న పిల్లల్ని అక్షర రూపంలో చూసుకుని మురిసిపోయే వాళ్ళం. చదువులు ముగించి ఉద్యోగాల్లో చేరారు. 'ఉత్తరాయణం' తగ్గిపోయింది. పెళ్ళిళ్ళయ్యాయి. ఎవరి సంసారాలు వాళ్ళవి. ఒకొకళ్ళు ఒక్కో వూర్లో. ఇప్పుడు ఉత్తరాలకి బదులుగా చీటికి మాటికీ ఫోన్లు చేసేస్తున్నారు. వాళ్ళు చేసే కాల్స్ రిసీవ్ చేసుకోవడానికే ఫోన్ పెట్టించాం. పిల్లలతో ఫోన్లో మాట్లాడుతున్నంత సేపూ వాళ్ళు మా పక్కనే వున్నట్టనిపించినా ఆ ఆనందం కొద్ది నిమిషాలు

మాత్రమేనని అనిపిస్తుంది. అదే ఓ ఉత్తరమైతే పదే పదే చదువుకుంటూ అబ్బ! ఆ మధురానుభూతిని మాటల్లో చెప్పలేం. "మీరు ఫోన్లు చేయండర్రా. వద్దనం. కాని మధ్య మధ్యలో వివరంగా ఓ జాబు రాయండి" అని ప్రతిసారీ మేం చెప్పడం. సరే సరే అంటారే గాని, ఎవ్వరూ రాయరు. కాని మేం మాత్రం ఇప్పటికీ ఉత్తరాలు రాయడం మానలేదు.


రాత్రి మా అబ్బాయి దగ్గర్నుంచి ఫోను. పిల్లాడికి ఒంట్లో బాగా లేదట. వెంటనే బయల్దేరి రమ్మని. ఇద్దరం వెళ్ళాం. వారం రోజుల్లో పిల్లాడు కోలుకున్నాడు. ఆరోజే స్కూలుకు వెళ్ళాడు. కొడుకూ, కోడలూ ఆఫీసుకు వెళ్ళారు. ఎటొచ్చీ పొద్దు పోవడం మాకో సమస్య. అందుకే ఇంట్లో బూజులు దులిపి సర్దుతున్నాం. అలమారాలో పుస్తకాలు సర్దుతూ వుంటే కవర్లు, ఇన్‌లాండ్ లెటర్లూ కింద పడ్డాయి. మేము అబ్బాయికి రాసిన ఉత్తరాలు అవి. కనీసం చింపనైనా లేదు. మా మనసులు విలవిల్లాడాయి. వాటిని భద్రంగా తీసి, నా బ్యాగులో పెట్టేసుకున్నాను. అబ్బాయి దగ్గర ఆ విషయం ప్రస్తావించనూ లేదు. "ఫోన్లలో మాట్లాడుతున్నాంగా. మరి ఆ ఉత్తరాలెందుకు?" అంటే మనసు బాధపడుతుంది. అంతకంటే ఈ బాధే నయం అనుకున్నాం.

నాలుగు రోజుల తర్వాత మా వూరికి ప్రయాణమయ్యాం. ఊరు చేరగానే ఫోన్ చేయండి అన్నాడు అబ్బాయి రైలెక్కిస్తూ. అబ్బాయి సంగతి ఇలా! మరి మా అమ్మాయి సంగతో? వద్దు. ఇక ఎలాంటి చేదు చవి చూడాలో? అయినా తప్పేముంది? ఈ మధ్య వాళ్ళు మమ్మల్ని జాబు రాయమని అడగటం లేదు కదా! మేమే రాసి, మేమే బాధ పడుతున్నాం. అంతే.

ఊర్నుంచి వచ్చిన తర్వాత నా దినచర్య మారిపోయింది. పోస్ట్‌మేన్ కోసం ఎదురు తెన్నులు లేవు. అసలు వస్తున్నాడా? లేడా అన్న అనుమానం అంతకన్నా లేదు. మేము ఉత్తరాలు రాయడం మానేశాం. మీరెందుకు రాయడం లేదని వాళ్ళు ఒక్క మాట కూడా అడగలేదు. ఎంతగా మాకు మేము సమాధాన పర్చుకున్నా మనసు మూలల్లో ఏదో ఓ వెలితి. చెప్పుకోలేని బాధ.

ఆరు నెలలయింది. ఆరోజు ఇద్దరం మాంబలం వెళ్ళాం. షాపింగ్ ముగించి ఇంటి కొచ్చే సరికి ఒంటి గంటయింది. పక్కింటి అమ్మాయి వచ్చి "మామీ ఉంగరుకు పోస్టు






వందిరుకు" అంటూ అరవంలో చెబుతూ ఓ కవరు తెచ్చిచ్చి వెళ్ళింది. ఆశ్చర్యం! ఆనందం కలగలిపిన అనుభూతి ఏదో హృదయాన్ని సుతారంగా మీటినట్టయింది. ఆ కవర్ అమెరికా నుంచి వచ్చింది. ఆత్రంగా చించి చదవసాగాం.

ప్రియమైన పిన్ని, బాబాయి గార్లకు,

నమస్కారం. ఎవరబ్బా అని ఆశ్చర్యపోతున్నారు కదూ! ముందు నన్ను నేను పరిచయం చేసుకుంటాను. నాపేరు సురేష్. ఆరు నెలల క్రితం మీరు బొంబే నుంచి వచ్చేటప్పుడు మీ ఎదుటి బెర్త్‌లో కూర్చున్నాను. ఇంకా బాగా గుర్తుకు రావాలంటే మీరు నా ఆటోగ్రాఫ్ పుస్తకంలో సంతకం కూడా చేశారు. ఆ.. ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది కదూ! ఆ రోజు మీ సంభాషణ వద్దనుకున్నా నా చెవుల్లో పడింది. ఎందుకో మీరు ఎంతో ఆత్మీయులుగా అనిపించారు. అందుకే మీ అడ్రస్ కూడా అడిగి తెలుసుకున్నాను. నా గురించిన వివరాలు అన్నీ మీకు ఆ రోజే చెప్పాను. నేను అమెరికా వచ్చి నాలుగు నెలలైంది. ఇప్పుడిప్పుడే అంతా సర్దుకుని, తీరిగ్గా మీకు ఉత్తరం రాస్తున్నాను.

ఉత్తరాలు రాయడం అంటే మీలాగే నాకూ ఎంతో ఇష్టం. మనం రాసే ఉత్తరం మన వ్యక్తిత్వానికి ప్రతిబింబం. నేనూ ఒకప్పుడు మా వాళ్ళందరికీ పేజీలకు పేజీలు ఉత్తరాలు రాసేవాణ్ణి. కాని బదులు రాసేవాళ్ళు ఒకళ్ళో, ఇద్దరో. వైజ్ఞానికంగా ఎంతో ముందంజ వేస్తున్నా మనం ఎంతో అమూల్యమైన ఉత్తరాలు రాయడమనే ఈ కళని కొద్ది కొద్దిగా మరచి పోతున్నాం. ఫోన్లూ, పేజర్లూ, ఇంటర్ నెట్‌లూ అంటూ నిమిషాల్లో విషయాల్ని అందుకోగలుగుతున్నాం. మరి తీరిగ్గా కూర్చుని ఉత్తరాలు రాసే ఓపికా, రాసినా చదివే తీరికా ఎక్కడుంది? అని అనుకుంటూ మనకి మనమే ఆత్మీయతలకి, అనుబంధాలకి కాస్త దూరమవుతున్నామేమో అని కూడా అన్పిస్తోంది.

ఓ తమాషా చెప్పనా? ఈ ఫోన్లూ, ఉత్తరాలూ, ఇన్‌స్టెంట్ కాఫీ, ఫిల్టర్ కాఫీల్లాంటివి. ఆస్వాదించే వారికి దేని రుచి దానిదే. నాకు ఫిల్టర్ కాఫీ అంటే ఎంతిష్టమో, ఉత్తరాలంటే అంతే ఇష్టం. మనకోసం వచ్చే ఉత్తరాన్ని అందుకుని, ఆత్రుతతో చదవడంలో ఓ ఆనందముంది. వచ్చిన ప్రతి ఉత్తరాన్నీ మళ్ళీ, మళ్ళీ చదువుకోవడంలో వుండే హాయి అనుభవిస్తే గాని తెలీదు. కాని, నాకు ఉత్తరాలు రాసేవాళ్ళే లేరు. ఈ విషయంలో మీరూ, నేనూ ఇంచుమించు ఒకే పడవలో ప్రయాణించే ప్రయాణీకులం. మీరు ప్రేమతో, అభిమానంతో రాసే ఉతరాలు అందుకుని, చదివి ఆనందించాలన్నదే నా కోరిక. మీ ఉతరాలకి బదులు ఉత్తరాలేనని హామీ ఇస్తూ, తప్పక బదులు రాస్తారని ఆశిస్తూ

-నమస్కారాలతో సురేష్

ఉత్తరం చదివి ఆనందంతో పొంగిపోయాం. ఎక్కడి అనుబంధం ఇది! ఎందో రైలు స్నేహం. ఆ స్నేహం కలం స్నేహంగా మారుతోంది. స్నేహానికి వయసుతో నిమిత్తం లేదు. ఓ మంచి మనసు కావాలి. అంతే. మూగవోయిన మన సులకి మాట వచ్చినట్టయింది. మా ఉత్తరాల కోసం ఎదురు చూసే ఓ మనిషి వున్నాడు. అది చాలు. అలాంటి వారి కోసమే మా ఉత్తరం. మళ్ళీ పోస్ట్‌మేన్ కోసం నిరీక్షణ మొదలైంది.